## క్లుప్తంగా

### బోగస్ ధ్రువపత్రాలపై విచారణ



విచారణ చేస్తున్న పీఓ కల్పనాకుమారి

**సీతంపేట:** బోగస్ ఎస్టీ ధ్రువపత్రాలపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి శనివారం విచారణ చేపట్టారు. తన కార్యాలయంలో డీఎల్‌సీ సమావేశం ఏర్పాటు చేశారు. ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని పిలిచి విచారించారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. కేసులకు సంబంధించిన వారి కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ ద్వారా తెప్పించాలన్నారు. రెండు కేసులను విచారణ చేశారు. సీఐడీ డీఎస్పీ భూపాల్, ఏపీఓ రోసిరెడ్డి, తహసీల్దార్ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ దేశ్ ఉన్నారు.

### నేడు నూతన కార్యవర్గం ఎన్నిక

**కురుపాం:** ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ ఎన్నిక విశాఖపట్నంలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ఉపాధ్యక్షుడు కోమటిపల్లి త్రినాథ రావు శనివారం తెలిపారు. ఈ సమావేశానికి అన్ని జిల్లాల నుంచి జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నట్లు చెప్పారు. మండల నాయకులు, ఉపాధ్యాయులు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

### గృహ నిర్మాణాల పరిశీలన

**పాలకొండ:** మండలంలోని బుక్కూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను హౌసింగ్ పీడీ రమేష్ శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మండలంలో 300 ఇళ్ల నిర్మాణాలను ఈ నెలలో పూర్తి చేయాల్సి ఉందన్నారు. లబ్ధిదారులకు వెంటవెంటనే బిల్లుల చెల్లింపు చేపడుతున్నామని వివరించారు. లబ్ధిదారులకు సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయనతో పాటు ఏఈ మాధవరావు ఉన్నారు.



నిర్మాణంలో ఉన్న ఇళ్లు పరిశీలిస్తున్న పీడీవో రమేష్

### ఆదివాసీ సమావేశం

**సీతంపేట:** ఏవైఎస్ సొసైటీ ఆధ్వర్యంలో అస్సాంలో ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, సోరా భాషా, లిపి పరిరక్షణపై సోరా సమావేశం జరిగినట్లు ఆ సంస్థ ప్రతినిధులు సవర చిన్నరాయుడు, వెంకటరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశంలో ఉన్న సోరా ప్రజలు సుమారు 5 వేల మంది ఈ సమావేశానికి హాజరైనట్లు వెల్లడించారు. ఒడిశా నుంచి రామ్‌ప్రసాద్ గోమాంగో పాల్గొన్నట్లు తెలిపారు.

### పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

**సీతంపేట:** స్థానిక గిరిజన బాలుర సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి ఆధ్వర్యంలో 10 మంది పేనల్ టీం ఇన్‌స్పెక్షన్ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల లెస్సన్‌ప్లాన్లు, బోధనతీరు, టీచింగ్ డైరీ వంటివి పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

### ప్రారంభమైన అయ్యప్ప దీక్షలు



కొత్తపల్లిలో అయ్యప్ప దీక్షను స్వీకరించిన స్వాములు

**గరుగుబిల్లి:** మండలంలో అయ్యప్పస్వామి దీక్షలు ప్రారంభమయ్యాయి. గరుగుబిల్లి, కొత్తపల్లి, పెద్దూరు, రావివలస, గొట్టివలస తదితర గ్రామాలలో పలువురు భక్తులు అయ్యప్ప మండల దీక్షలు చేపట్టారు. 41 రోజుల పాటు నలుపురంగు దుస్తులు ధరించి కఠిన నియమాలు పాటిస్తూ అయ్యప్పను ఆరాధిస్తారు. జీవులందరిలో దేవుడు ఉన్నాడనే భావనతో ప్రతి ఒక్కరినీ 'స్వామి' అని పిలుస్తారు. ఏటా అయ్యప్ప దీక్షను స్వీకరించేవారి సంఖ్య పెరుగుతునే ఉంది.

### నీటి కోసం పాట్లు



బొడ్డగూడ వద్ద పొలాలకు నీరు పెడుతున్న రైతులు

**భామిని:** మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పంటలు కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఆకాశం వైపు వర్షం కోసం ఎదురు చూసి విసిగిపోయి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల వైపు చూస్తున్నారు. నీటివనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఇంజిన్ల ద్వారా పంటకు నీటి తడులు అందిస్తున్నారు. మండలంలోని బొడ్డగూడ వద్ద శనివారం గిరిజన రైతులు ఇంజిన్ ద్వారా పొలానికి నీరు పెడుతూ కనిపించారు.

## మత్స్యకారుల జీవనోపాధికి
# ప్రభుత్వం తోడ్పాటు

● ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

**పాలకొండ:** మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని, ప్రభుత్వం అందించిన సహకారాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలోని భగీరథ చెరువులో ఐటీడీఏ సహకారంతో అందించిన చేపపిల్లలను శనివారం వారు విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్యకార యువత జీవనోపాధికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ నాయకులు మురళీ, మత్స్యశాఖ అధికారి శోభన్‌బాబు, కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, ఆకుల కుమార్, కడగల రమణ, బాసూరు కాంతారావు, కిల్లారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: చేపపిల్లలను చెరువులో విడిచిపెడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు



సీతంపేట: చేపపిల్లలను చెరువులో విడిచి పెడుతున్న రైతులు

**సీతంపేట:** మండలంలోని వాబ, లోకొత్తవలస, కుశిమి, గొయిది పంచాయతీల్లో ఉన్న వివిధ చెరువుల్లో 42,200 చేపపిల్లలను విడిచిపెట్టినట్లు మత్స్యశాఖ అధికారి గోపాలకృష్ణ తెలిపారు. చేపల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులకు వాటిని ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు.

# ఆర్తులకు అండగా సీఎం సహాయనిధి



బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

● ఎమ్మెల్యే కళావతి

**వీరఘట్టం:** ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్తులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని బొడ్లపాడు గ్రామానికి చెందిన బాడంగి వెంకటనాయుడు కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన లక్ష రూపాయల చెక్‌ను శనివారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. కొద్దిరోజుల కిందట వెంకటనాయుడు కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో వైద్యులు కాలును తొలగించారు. ఆ కుటుంబానికి ఎటువంటి ఆధారం లేకపోవడంతో సీఎం సహాయనిధికి ఎమ్మెల్యే కళావతి నెల రోజుల కితం సిఫార్స్ చేశారు. సీఎం సహాయనిధి నుంచి లక్ష రూపాయలు మంజూరైంది. అయితే వారం రోజుల కిందట వెంకటనాయుడు మృతి చెందడంతో ఆ చెక్కును ఆయన భార్య పార్వతి, కుమారుడు రాజుకు వండవలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**పాలకొండ:** మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన బచ్చల చిన్నబాబు కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే పాలవలస విక్రాంత్ శనివారం అందించారు. చిన్నబాబు కుమారుడు శార్విక్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందారు. ఈ మేరకు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేపట్టిన ఖర్చు రూ.35 వేలు ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేశారు. ఈ చెక్కును ఆయన బాధితులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శాసుబిల్లి జనార్దనరావు, పతివాడ మోహనరావు, బలగ నాయుడుబాబు,బచ్చల రాము పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

## చురుగ్గా బీంపురం వంతెన పనులు

**కురుపాం:** మండలంలోని ఒబ్బంగి పంచాయతీ పరిధిలో బీంపురం వంతెన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దశాబ్దాలుగా వంతెన మంజూరు చేయాలన్న గిరిజనుల కల ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి చొరవతో నెరవేరనుంది. వంతెన నిర్మాణానికి ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులు రూ.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. జులైలో వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులను ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చురుగ్గా చేపట్టడంతో ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తికావచ్చాయి. మరో నెల రోజుల్లో వంతెన నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఐడీ డీఏ ఇంజినీరింగ్ డీఈ సింహాచలం, ఏఈ అప్పారావులు తెలిపారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే పార్వతీపురం ఐటీడీఏ, అటు సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న వందలాది గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమం అవుతుంది.



చురుగ్గా జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

## ప్రత్యామ్నాయ పంటలతో అధిక ఆదాయం

**సీతంపేట:** ప్రత్యామ్నాయ పంటలతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ సైంటిస్ట్ సీతారాం అన్నారు. స్థానిక పరిశోధనా స్థానంలో శనివారం రైతులకు శిక్షణ ఇచ్చారు. వరితో పాటు ఇతర పంటల్లో చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు బి.శారద, ఐటీడీఏ పీఏఓ హరికృష్ణ, పార్వతీపురం, పాలకొండ, సాలూరు మండలాల సహాయ సంచాలకులు టి.వెంకటేశం, కె.రత్నకుమారి, మధుసూదనరావు, నిర్మల జ్యోతి, శాస్త్రవేత్తలు లక్ష్మీ నారాయణ, పి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సైంటిస్ట్ సీతారాం

## సీపీఓ నిజాయితీ



పాలకొండ రూరల్: ఎస్సై సమక్షంలో బాధితురాలికి నగదు, ఆభరణాలు అందిస్తున్న శ్రీనివాసరావు



జియ్యమ్మవలస: దొరికిన ఫోన్‌ను పోలీసులకు అందజేస్తున్న అశోక్‌కుమార్

**పాలకొండ రూరల్:** స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీపీఓ విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసుకు తన నిజాయితీని చాటుకున్నాడు. వీపీ రాజుపేట కూడలి వద్ద తనకు ఒక బ్యాగు దొరకగా.. అందులో కొంత నగదు, బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించాడు. దాన్ని తీసుకువెళ్లి ఎస్సై బి.శివప్రసాద్‌కు అప్పగించాడు. దీనిపై విచారణ చేసిన పోలీసులు ఆ బ్యాగు అట్టలి గ్రామానికి చెందిన పాపమ్మకు చెందినదిగా గుర్తించారు. పాపమ్మ విజయవాడ నుంచి స్వగ్రామం వచ్చే క్రమంలో పాలకొండలో ఆటో ఎక్కింది. మార్గం మధ్యలో బ్యాగును పోగొట్టుకుంది. పోలీసులు ఆమెను స్టేషన్‌కు పిలిచి శ్రీనివాసరావు చేతులమీదుగా పోగొట్టుకున్న బ్యాగును అప్పగించారు. నిజాయితీగా వ్యవహరించిన సీపీఓను పోలీస్ అధికారులు అభినందించారు.

**దొరికిన ఫోన్ అప్పగింత**

**జియ్యమ్మవలస:** మండలంలోని వనజ గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ బీజేపురం బ్రిడ్జి వద్ద తనకు దొరికిన స్మార్ట్‌ఫోన్‌ను జియ్యమ్మవలస పోలీసులకు అందించి తన నిజాయితీని చాటుకున్నాడు. వీరఘట్టం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి చెందిన ఫోన్‌గా పోలీసులు గుర్తించారు. దొరికిన ఫోన్‌ను నిజాయితీగా అందించిన ఆశోక్‌ను పోలీసులు అభినందించారు.

## జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు

**గరుగుబిల్లి:** జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గృహనిర్మాణ శాఖ డీఈఈ పి.మోహనరావు అన్నారు. మండలంలోని పెద్దూరు గ్రామంలో జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ జగనన్న కాలనీలో బోర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ టి.ఎల్లంనాయుడు, ఏఈ వి.అఖిల్‌నాయుడు, తదితరులున్నారు.



జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన బోరును పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈఈ మోహనరావు

## కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



కొమరాడ: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పద్మ



పాలకొండ రూరల్: కిమ్స్‌లో చికిత్స పొందుతున్న నారిశెట్టికి పింఛను అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్

**కొమరాడ:** అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధుడికి వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ డబ్బులు అందజేసింది. కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన బర్ల చిన్నయ్య అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. పింఛన్ లబ్ధిదారుడు కావడంతో వలంటీర్ పి.పద్మ శనివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. అంత దూరం వచ్చి పింఛన్ ఇవ్వడంతో వృద్ధుడి కుటుంబ సభ్యులు వలంటీర్ సేవలను అభినందించారు.

**పాలకొండ రూరల్:** ఎం.సింగుపురానికి చెందిన కె.నారిశెట్టి అనారోగ్యంతో శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వలంటీర్ రెడ్డి భువనేశ్వరరావు, వెల్ఫేర్ సహాయకుడు ఆర్.చరణ్ రాజ్, వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు రణస్థలం రాంబాబు శనివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.

## 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

**గరుగుబిల్లి:** ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు స్థానిక శాఖా గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు శనివారం తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 7,8 తేదీల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

### రేషన్‌డిపోలో ముక్కిన బియ్యం

**సీతంపేట:** మండలంలోని శంబాం రేషన్‌డిపోలో ముక్కిపోయిన రేషన్ బియ్యం ఉన్నట్టు తాము గుర్తించామని పలువురు లబ్ధిదారులు ఆరోపించారు. ఇవే బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేస్తే అనారోగ్యం పాలవుతారని అన్నారు. ముక్కిపోయిన బియ్యాన్ని కాకుండా మంచి వాటిని పంపిణీ చేయాలని కోరారు. దీనిపై సీఎస్‌డీటీ మధుసూదనరావు వివరణ కోరగా.. 10 బస్తాల వరకు తడిచిన బియ్యం వచ్చి ఉంటాయని, వాటిని మార్పు చేసి మంచి బియ్యాన్ని రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు.

### ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

**సీతంపేట:** మండలంలోని గుజ్జి గ్రామంలో గ్రామదేవత ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యంలో పలు గ్రామాల్లో గ్రామదేవత ఆలయాల నిర్మాణానికి టీటీడీ ద్వారా నిధులు మంజూరైనట్లు చెప్పారు. నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో చేపట్టాలని, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ ఏఎంసీ చైర్మెన్ హెచ్.మోహనరావు, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**పాలకొండ రూరల్:** మండలంలోని ఓని గ్రామంలో జీజీఎంపీ నిధులతో చేపడుతున్న తాగునీటి వనరుల అభివృద్ధి పనులను వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, గ్రామ సర్పంచ్ కె.రవణమ్మ, తదితరులు శనివారం పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.1.90 లక్షల వ్యయంతో తొలివిడత డ్రైన్‌లు, తాగునీటి వనరుల పునరుద్ధరణ పనులు చేపట్టారు. వారి వెంట ఆడబ్ల్యూఎస్ విభాగం డీఈఈ ఢిల్లేశ్వరావు, ఏఈ హెచ్.ప్రవళిక, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**గుమ్మలక్ష్మీపురం:** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంత్రి మండలి ఆమోదం తెలపడం పట్ల గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, బి.కుమారస్వామి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలుమార్లు గత ప్రభుత్వాలకు, అధికారులకు విన్నవించుకున్నప్పటికీ కార్యరూపం దాల్చలేదని, ఎట్టకేలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టుల కలను సాకారం చేసేలా ఇళ్ల స్థలాలు మంజూరుకు పూనుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో గౌరవఅధ్యక్షులు పి.కొండలరావు, ఉపాధ్యక్షుడు పాలక ప్రేమానంద్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

# ఓటర్ల జాబితా ప్రదర్శించాలి

**పాలకొండ రూరల్:** బూత్‌లెవెల్ అధికారులు విధిగా పోలింగ్ కేంద్రాల వద్ద నిర్దేశిత సమయాల్లో ఉండాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనకుమారి సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శని, ఆదివారాలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాలకొండ పోస్టాఫీస్ సమీపంలో ఉన్న పోలింగ్ బూత్ నంబర్ 167, ఆర్‌సీఎం పాఠశాలలో ఉన్న 168 పోలింగ్ బూత్‌లను శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కచ్చితంగా సంబంధిత కేంద్రానికి కేటాయించిన తాజా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఎన్నికల నిబంధనలకు లోబడి సదరు కేంద్రాల్లో ఉన్న వసతులపై ఆరాతీశారు.

**అర్హులంతా ఓటు హక్కు పొందాలి**

**గుమ్మలక్ష్మీపురం:** అర్హులంతా ఓటు హక్కును పొందాలని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి ఓటు నమోదు, మార్పులు చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌ను తహసీల్దార్ పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం కూడా ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. అర్హులంతా దీన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

**భామిని:** జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదుచేసుకోవాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు, డీటీ నిమ్మల శేఖరం కోరారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఘనసర, భామిని, బాలేరు పోలింగ్ బూత్‌లను తహసీల్దార్, టీడీ సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. ఓటు నమోదుపై బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఆదివారం కూడా స్పెషల్ డ్రైవ్ ఉంటుందని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారితో పాటు ఆర్‌ఐ ఎస్.రాంబాబు ఉన్నారు.



ఆర్‌సీఎం పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓల నుంచి వివరాలు సేకరిస్తున్న పీఓ కల్పనకుమారి



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట పోలింగ్ కేంద్రంలో ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాములమ్మ



భామిని: ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ అప్పారావు

## ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

**పార్వతీపురం టౌన్:** జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. కేబినెట్ నిర్ణయంపై స్థానిక జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్య లను పరిష్కరించలేదని, జగనన్న ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇల్లు పట్టాలు మంజూరు చేయాలని నిర్ణయించి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నవీకరణ విధానాలకు అనుగుణంగా
# వైద్య సిబ్బంది కార్యాచరణ

**పార్వతీపురం టౌన్:** వ్యాధి నిరోధక టీకా కార్యక్రమంలో నవీకరణ విధానాలకు అనుగుణంగా వైద్య సిబ్బంది కార్యాచరణ చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం పట్టణంలోని 18వ వార్డులో టీకా కార్యక్రమం, చర్చివీధి పట్టణ ఆరోగ్య కేంద్రం పీపీ యూనిట్‌లో వ్యాక్సిన్ నిల్వలు తనిఖీ చేశారు. చిన్నారులకు వైద్య సిబ్బంది టీకా వేస్తున్న తీరును టీకా రికార్డులను నిశితంగా పరిశీలించి ఏ మేరకు నిర్దేశించబడిన మార్గదర్శకాలు పాటిస్తున్నారో గమనించారు. టీకా వేసే ముందు వ్యాక్సిన్ వీవీఎమ్ స్థితి, కాలపరిమితి, పిల్లల ఆరోగ్య స్థితి తప్పక పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. అత్యవసర మందులు కిట్ తనిఖీ చేశారు. అర్హులందరూ టీకా కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. టీకాల ఆన్‌లైన్ విధానం యూవిట్ ఆర్‌సీహెచ్ పోర్టల్ పరిశీలించారు. వారి పరిధిలో ఉండే ఐదేళ్లలోపు పిల్లలందరినీ యూవిన్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం సందర్శించి అక్కడి ఓపీ నిర్వహణను రికార్డులో తనిఖీ చేసి నమోదు అవుతున్న వ్యాధులు, అందజేస్తున్న చికిత్సను పరిశీలించారు. డాక్టర్ ఎం.మనోజ్, సూపర్‌వైజర్ పుష్ప, జయాగౌడ్ ఉన్నారు.